

# కారణాలు

"ఏమిరా కిష్టాయ్! ఏమిటి ఇంకా పడుకున్నావ్! లే! లే! స్కూలు వేళ దాటిపోతుంటే మీ నాన్నగారు కూడా ఆఫీసు కెళ్ళారు. లే యింక" దుప్పటి ఒక్క లాగు లాగింది దేవకి.

"అబ్బ ఉండమ్మా! ఒక్క ఐదు నిమిషాలు!" గునిశాడు కృష్ణ.

"ఏమిట్రా ఐదు నిమిషాలు! ఎక్కడి వాళ్ళక్కడ స్కూళ్ళకి, ఆఫీసులకి వెళ్ళిపోతేనూ, ఏమిటో ఐదు నిమిషాల్ట! ఐదు నిమిషాలు! లే! లే! కసిరింది.

"నే నివ్వాళ వెళ్ళనమ్మా స్కూలుకి" మారాం చేశాడు కృష్ణ.

"అదేమిట్రోయ్" ఆశ్చర్యపోయింది దేవకి.

"నేను వెళ్ళను"

"ఏం?"

"ఏం ఏమిటి? నేను వెళ్ళనంటే! దుప్పటి తిరిగి లాక్కున్నాడు కృష్ణ.

"అదే! ఎందుకని?" దుప్పటి అంగి లాగింది దేవకి

"ఏవో నా కారణాలు నావి" బుంగమూతి పెట్టాడు కృష్ణ.

నవ్వింది దేవకి. "ఆహా! అలాగా ఏమిటో ఆ కారణాలు? రెండు చెప్పు చూద్దాం.

"పిల్లలకెవరికీ నేను గిట్టను, టీచర్ల కెవరికీ నేను గిట్టను. చాలా ఈ రెండు కారణాలు?" దబాయించాడు కృష్ణ.



"ఎవరికీ గిట్టకపోయినా సరే! నువ్వు స్కూలుకి వెళ్ళి తారాల్సిందే" చెవి పుచ్చుకుని లేపుతూ డబుల్ దబాయించింది దేవకి.

"అయితే నువ్వు చెప్పు చూద్దాం రెండు కారణాలు! నేను స్కూలు కెందు కెళ్ళాలో" చెవి విడిపించుకుంటూ అడిగాడు కృష్ణ.

దేవకి నవ్వుతూ, "ఎందుకో! ఒకటి నీకు ముప్ఫై ఐదేళ్ళు కాబట్టి, రెండు, నువ్వు ఆ స్కూలుకి ప్రిన్సిపాలువి కాబట్టి, ఇక పద నోరుమూసుకుని" అంది.